క్లుప్తంగా

అవసరం మేరకే ఎరువులు, పురుగు మందులు వాడాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ఎరువులు, పురుగు మందులను పంటలకు అవసరం మేరకే వినియోగించాలని మండల వ్యవసాయాధికారి జోగిరాజు అన్నారు. స్థానిక గ్రామ సేవ కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ పంటకైనా తొలి 45 రోజుల్లో వచ్చే తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం ఉంటుందన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలను పాటిస్తే, ఆశించిన మేరకు దిగుబడి వస్తుందన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు పంట సాగుపై సూచనలు అందిస్తూ, ఏ సమయంలో, ఎంత మోతాదులో మందులు వాడాలో తెలియజేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆర్‌బీ పట్నంలో పొలం పిలుస్తోంది



కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

పెద్దాపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం ఏడీఏ దైవకుమార్ అన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏఓ సంజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఏడీఏ దైవకుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలో తెగుళ్లు, చీడలపై వివరించారు. సామూహిక ఎలుకల నిర్మూలనపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు డాక్టర్ జానకి, ఏఎస్ శర్మ మాట్లాడుతూ, మినుము పంటలో తెల్లదోమ నివారణకు అఫిసెట్ మందును ఎకరానికి 300 లేదా అసెటమాఫైడ్ 50 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడుతూ, పశువులకు సీజనల్ వ్యాధుల టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. పశువులకు బీమా చేయించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి సుజాత, ఏఈఓ ఎన్‌వీవీ ప్రసాద్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో ఉపవాస ప్రార్థనలు

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోసం ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనల్లో భాగంగా ఈ నెల 3, 4 తేదీల్లో మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థన మందిరంలో ఉపవాస ప్రార్థనలు నిర్వహించనున్నట్లు మందిర వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం తెలిపారు. మంగళవారం ఆయన క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ప్రపంచంలో నెలకొన్న అశాంతి తొలగి, శాంతియుత వాతావరణం నెలకొనాలని దివిలి, చదలాడ, తిరుపతి, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ క్రీస్తు శాంతి ప్రార్థన మందిరాల్లో ఐదు నెలల పాటు ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఆఖరిగా దివిలిలో నిర్వహించే ఉపవాస ప్రార్థనలకు ఏరుపల్లి దైవప్రేమ సన్నిధి వ్యవస్థాపకుడు రెవరెండ్ బదిరెడ్డి అరుణ్‌కుమార్ దైవ ప్రసంగాన్ని అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రార్థనల్లో భాగస్వాములు కావాలని పాస్టర్ సత్యానందం కోరారు.

నేడు మాంసం, చేపల విక్రయాలు నిషేధం

సామర్లకోట: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం మాంసం, చేపల విక్రయాలను నిలుపుదల చేయాలని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆదేశాలు జారీ చేశారు. అదే విధంగా హోటళ్లలో చేపలు, మాంసాహారాల తయారీ, విక్రయాలు నిషేధమన్నారు. గాంధీ జయంతి రోజున ప్రతి ఒక్కరూ జంతువులను వధించడానికి దూరంగా ఉండాలని కమిషనర్ కోరారు. మాంసం, చేపల విక్రయాలు చేసినా, మాంసాహారాలను విక్రయించినా చట్టపరమైన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు.

సినిమాలు

పెద్దాపురం	
లలితా స్క్రీన్-1	దేవర
లలితా స్క్రీన్-2	సత్యం సుందరం
వీరభద్ర	దేవర
శోభా	భలే ఉన్నాడే
సామర్లకోట	
అనుశ్రీ స్క్రీన్-1	దేవర
అనుశ్రీ స్క్రీన్-2	దేవర
విఘ్నేశ్వర	సత్యం సుందరం
పిఠాపురం	
అన్నపూర్ణ	మత్తు వదలరా 2
పూర్ణ	టూ షోస్ చెక్ లేట్
పూర్ణ 2	దేవర
శ్రీసత్య	దేవర
శ్రీవెంకటేశ్వర	దేవర
ఉప్పాడ	
శ్రీనివాస	మత్తు వదలరా 2

ఎలుకపై సమరం

- సార్వా వరిపై మూషిక దాడి
- చిరుపొట్ట, ఈనిక దశలో ఎలుకల విజృంభణ
- ఒక దానిని పట్టుకునేందుకే రూ.వంద ఖర్చు
- ఎకరాకు రూ.3 వేలకు పైగా వ్యయం
- నియోజకవర్గంలో 12 వేల హెక్టార్లలో పంట సాగు



ఎలుక కలుగులను గుర్తిస్తున్న రైతులు

కొత్తపల్లి: సార్వా రైతులకు మూషికాల బెడద పెద్ద తలనొప్పిగా తయారైంది. ఖరీఫ్ పంటపై మూషికాలు మూకుమ్మడి దాడి చేస్తూ.. వరిని కొరికి పాడు చేస్తున్నాయి. ప్రస్తుతం వరిపైరు పొట్ట, ఈనిక, గింజ పాటు పోసుకునే దశల్లో ఉంది. ఈ దశలో వరి మొక్క తీపిగా ఉండటంతో ఎలుకలు వరి దుబ్బులను కొరికి వేస్తున్నాయి. పది రోజులుగా ఏ ఆయకట్టులో చూసినా ఎలుకలు కొరికివేసిన వరిని ఏరుతున్న రైతులు, కూలీలు, ఎలుకలను పడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

అనేక ప్రయత్నాలు

ఎలుకల నిర్మూలనకు రైతులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం ఉండటం లేదు. ఒకవైపు తెగుళ్లు, మరోవైపు ఎలుకల బెడదతో రైతులకు ఊపిరి సలపడం లేదు. ఎలుకల బుట్టలు, మందును బొరియల్లో వేయడం ద్వారా వీటి బెడదను వదిలించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కలుగు తవ్వి ఎలుకను పడితే రూ.60, బుట్టలో పడితే ఎలుకకు రూ.100 చొప్పున రైతులు చెల్లిస్తున్నారు. ఎన్ని ఎలుకలను పట్టినా, మళ్లీ పొలాలలోకి ఎలుకలు చేరుతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఖర్చులు తడిసి మోపెడు

ఎలుకలు కొరికిన వరి మొక్కలు ఏరడానికి కూలీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. ఎలుకలు కొరికివేసిన వరి మొక్కలను కట్టలుగా కట్టి, పశువులకు మేతగా వేస్తున్నారు. ఎలుకలు చేల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ వరి దుబ్బులు కొరికివేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



ఎలుకలు నాశనం చేసిన వరి పంట



ఇసుకపల్లిలో ఎలుకల మందుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నియోజకవర్గంలో ఇలా..

కాగా నియోజకవర్గంలోని కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలుల్లో సుమారు 12 వేల హెక్టార్లలో వరి పంట సాగు చేస్తున్నారు. కొత్తపల్లి మండలంలో సుమరు 6,150 మంది రైతులు 10,154 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

ఎలుకల మందు పంపిణీ



ప్రస్తుతం పైరు ఈనిక, గింజ పాలు పోసుకునే దశలో ఉంది. ఈ స్థితిలో వరిని ఎలుకలు ఎక్కువగా పాడు చేస్తాయి. రైతులకు ఎలుకల మందును పంపిణీ చేస్తున్నాం. ఎలుకల మందు వాడకంపై కూడా అవగాహన కల్పించాం. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న. గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ఎలుకలు మందు అందుబాటులో ఉంది.

– జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

అవగాహన కల్పిస్తున్నాం



ఎలుకల మందు వినియోగంపై రైతులకు తెలియజేస్తున్నాం. వరి పంటపై పాటించాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నాం. గ్రామ సేవా కేంద్రాల్లో ఎలుకల మందు ఉచితంగా అందజేస్తాం. ఎలుకలు పొలాల్లోకి చేరి ఇష్టారాజ్యంగా పంటను పాడుచేసుతన్నాయి.

– గౌతం, గ్రామ వ్యవసాయ సహాయకుడు, ఇసుకపల్లి

మున్సిపల్ కుళాయిల్లో నురగ నీరు



సామర్లకోట మున్సిపల్ కుళాయిల నుంచి నురగతో వచ్చిన తాగునీరు

సామర్లకోట: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న తాగునీరు కొంత కాలంగా నురగతో వస్తోంది. బిందెలు, బక్కెట్లలో కుళాయి నీరు పట్టుకున్న సమయంలో నీరు సబ్బు నురగ వచ్చినట్టుగా పాత్రలు నురగతో నిండిపోతున్నాయి. ఈ నీటి వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయోనని ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ తాగునీటిపై శ్రద్ధ చూపాల్సిన అధికారులు.. ఫిల్టర్ బెడ్ వద్ద కానరావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ డీఈ తాగునీటిపై ప్రతి రోజూ ఫిల్టర్ బెడ్ వద్దకు వెళ్లి పరిశీలించాల్సి ఉండగా, కార్యాలయానికే పరిమితం అవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడేలా తాగునీరు సరఫరా చేస్తున్నారని జిల్లా మానవ హక్కుల సంఘం అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ ఆరోపించారు. కొంత కాలం ఆకుపచ్చ రంగులోను, మరికొంత కాలం బురదగాను, గత 15 రోజులుగా నురగతో తాగునీరు వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రైల్వే ట్రాక్‌లో అధికారుల పరిశుభ్రత



రైల్వే ట్రాక్‌లో చెత్తను తొలగిస్తున్న అధికారులు

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం రైల్వే అధికారులు రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌తో పాటు, పరిసరాల్లోని డ్రైన్లు, కాలనీలను శుభ్రం చేశారు. ప్రయాణికులు ఆయా స్టేషన్లలో రైళ్లు ఆగిన సమయాల్లో చెత్తను బోగీల నుంచి వేయడం వలన స్టేషన్లలోని ట్రాక్‌లు అపరిశుభ్రంగా మారుతున్నాయని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చెత్తను ప్లాట్‌ఫాంలపై ఉన్న డస్ట్‌బిన్లలోనే వేయాలన్నారు. కొంత మంది భోజనాలు చేసి, తాగునీటి కుళాయిల వద్ద అపరిశుభ్రం చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కుళాయి ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరిలోను అవగాహన పెంచడం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్(వర్క్స్) రవికాంత్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్ రామకృష్ణ, జూనియర్ ఇంజినీర్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రమదానం

సామర్లకోట: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక నీలమ్మ చెరువు గట్టుపై శ్రమదానం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు హాజరు కావాలన్నారు.

కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి

- ఏపీ రైతు కూలీ సంఘం రాష్ట్ర నేత కర్నాకుల వీరాంజనేయులు



పులిమేరులో ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు హెచ్చరించారు. మండలంలోని పులిమేరులో మంగళవారం రైతు కూలీలతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ, తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కుపై కపట నాటకాలాడుతున్నాయని దుయ్యబట్టారు. ప్రైవేటీకరణ చేయబోమని ప్రకటనలు చేస్తూనే, మరోవైపు విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రాత్రికి రాత్రే సుమారు 4,290 మంది కార్మికులను తొలగించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. తక్షణమే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ముసిలిబాబు, పి.అన్నవరం, నారాయణరావు, భూషణం, తమ్మిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు




విజేతలతో నిర్వాహకులు

పిఠాపురం: జన విజ్ఞాన వేదిక గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గొల్లప్రోలు ఎంఈఓ-1 నాయుడు వెంకటేశ్వరరావు చెకుముకి సైన్స్ సంబరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎందుకు ఏమిటి, ఎలా అని పరిశీలించి, తెలుసుకోవాలన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు. మండల స్థాయి చెకుముకి పేపర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎంఈఓ-2 శివప్రసాద్, వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు వి.సత్యనారాయణ రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు దాడి పద్మనాభం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు అక్టోబర్ 27న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సంబరాల్లో పాల్గొనాలని మండల చెకుముకి కన్వీనర్ అనిశెట్టి సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదిక గొల్లప్రోలు మండల అధ్యక్షుడు ఏలేటి నాని బాబు, జిల్లా సమత కన్వీనర్ సీహెచ్‌యూఆర్ మంగతాయారు ,స్కూల్ హెచ్‌ఎం ఈపీ సూర్యప్రకాశ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చేతులూరి సూరిబాబు, ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎంవీ సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి దాసం గోవిందరాజులు, కార్యదర్శి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో జేఎస్‌ఆర్ ఆదర్శప్రాయుడు

- ఆర్డీఓకు వీడ్కోలు సభలో వక్తలు



ఆర్డీఓ సీతారామారావును సత్కరిస్తున్న తహసీల్దార్లు

పెద్దాపురం: రెవెన్యూ సేవల్లో జె.సీతారామారావు సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల బదిలీపై వెళుతున్న పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు వీడ్కోలు సభ కార్యాలయ డీటీ భానుకుమార్ అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆయా మండలాల తహసీల్దార్లు మాట్లాడుతూ, రెవెన్యూ సేవల్లో ఎంతో అనుభవమున్న సీతారామారావు వద్ద పనిచేయడం ఆనందంగా ఉందన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించడంలో ఆయన పాత్ర కీలకమన్నారు. కింది స్థాయి సిబ్బందిని ఇబ్బందులు పెట్టకుండా, అన్ని వేళల్లో విధులను సక్రమంగా నిర్వహించిన ఆయన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆర్డీఓ సీతారామారావు మాట్లాడుతూ, రెండున్నరేళ్లలో మంచి సేవలందించి, మన్ననలు పొందామంటే సిబ్బంది ప్రతి ఒక్కరి సహకారం ఉందన్నారు. ఇప్పటి వరకు అన్ని విధాలా సహకరించిన ప్రతి ఒక్కరికీ దన్యావాదాలు తెలుపుతున్నానన్నారు. అనంతరం డివిజన్‌లోని 11 మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, పెద్దాపురం తహసీల్దార్ వెంకటలక్ష్మి, డీటీ కాంతారావు, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు విజయ్‌కుమార్, దయానందరాజు, ఆయా మండలాల తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈ భవానీశంకర్ సస్పెన్షన్ రద్దు

పిఠాపురం: పిఠాపురం మున్సిపాలిటీలో డీఈ ఎస్ భవానీశంకర్ మంగళవారం మళ్లీ విధుల్లోకి చేరారు. గత ఆగస్టు 31న పిఠాపురం మున్సిపాలిటీలో జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో డీఈ భవానీ శంకర్, కమిషనర్ నామ కనకారావు మధ్య చోటుచేసుకున్న వాగ్వాదం, తోపులాట వివాదం నేపథ్యంలో ఉన్నతాధికారుల చర్యల్లో భాగంగా డీఈ భవానీశంకర్‌ను అదేరోజు సస్పెండ్ చేశారు. కౌన్సిల్ సమావేశంలో జరిగిన సంఘటనపై తనకు సరైన న్యాయం జరగలేదని డీఈ కోర్టును ఆశ్రయించడంతో, సెప్టెంబర్ 13న సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డీఈ భవానీశంకర్ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కనకారావుకు ఉత్తర్వులను అందజేసి విధుల్లోకి చేరారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ, కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన విధుల్లో చేరారని చెప్పారు. ఉత్తర్వుల ఆధారంగా మూడో పార్టీ అయిన ఈఎన్సీకి నివేదిక పంపుతామన్నారు. అనంతరం డీఈ భవానీశంకర్ వివరణ ఇస్తూ, కౌన్సిల్ సమావేశంలో జరిగిన వాగ్వాదంలో తనకు జరిగిన అన్యాయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో, వాదనలు విన్న కోర్టు సస్పెన్షన్‌ను రద్దు చేస్తూ, తిరిగి విధుల్లోకి చేరాలని ఆదేశించినట్టు తెలిపారు.

వైఎస్సార్ సీపీ నేతల ఆధ్వర్యంలో గోతుల పూడ్చివేత




కెనాల్ రోడ్డులో గోతుల పూడ్చివేతను పరిశీలిస్తున్న నాయకులు

సామర్లకోట: కెనాల్ రోడ్డు సుగర్ ఫ్యాక్టరీ నుంచి ధవళేశ్వరం వరకు గోతులతో అధ్వానంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదంటూ వైఎస్సార్ సీపీ నాయకులు ఈ సమస్యపై నడుం బిగించారు. మేడపాడు నుంచి పీబీ దేవం వరకు సుమారు 4 కి.మీ. పొడవున ఉన్న గోతులను గ్రావెల్‌తో పూడ్చే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. పీబీ దేవం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మలకల సూరిబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు ఆధ్వర్యంలో పది ట్రాక్టర్ల గ్రావెల్ తెచ్చి జేసీబీతో గోతులు పూడ్చించారు. కెనాల్ రోడ్డులో లైట్లు లేక రాత్రి వేళల్లో గోతులు కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

బచ్చు ఫౌండేషన్ స్కూలు విద్యార్థుల ప్రతిభ

సామర్లకోట: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్టు హెచ్‌ఎం తోట కూర సాయిరామకృష్ణ తెలిపారు. విద్యార్థులు గౌతమ్, జి.లక్ష్మీవర్షిణి అండర్-14 విభాగంలో ఖోఖోకు, సీహెచ్ కార్తీక్ అండర్ 17 విభాగంలో కబడ్డీకి ఎంపికయ్యారని చెప్పారు.

కరెంటు కోతతో బాలింతలు, చిన్నారుల ఇక్కట్లు



ఆస్పత్రిలో బిడ్డలతో బాలింతల అవస్థలు

సామర్లకోట: సుమారు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం ఎటువంటి సమాచారం లేకుండా పట్టణంలోని అనేక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దాంతో ఆస్పత్రిలో ఉన్న బాలింతలు, చిన్నారులు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆస్పత్రికి జనరేటర్ ఉన్నా ప్రయోజనం లేకపోయింది. డాక్టర్లు ఉన్నప్పుడే జనరేటర్ వేస్తున్నారని చెబుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మేడపాడు విద్యార్థుల ఎంపిక

సామర్లకోట: స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా కాకినాడ జిల్లా డీఎస్‌ఏ మైదానంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో మేడపాడుకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో సామర్లకోట మండలం జి. మేడపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన జానా అస్మిత, బాలుర అండర్-14 కేటగిరిలో ఎం.వినయ్‌కుమార్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగార్రాజు మంగళవారం విలేకర్లకు తెలిపారు. జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబర్చి ఎంపికైన ఈ విద్యార్థులు జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహించి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నవంబర్‌లో విజయనగరం జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం జి.పాండవులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో పాటు, విద్యా కమిటీ సభ్యుడు పాలకుర్తి బ్రహ్మాజీ అభినందించారు.

కబడ్డీ పోటీలకు జెడ్పీ స్కూలు బాలికల ఎంపిక

సామర్లకోట: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల హెచ్‌ఎం యు మీనామాధురి విలేకర్లకు తెలిపారు. జిల్లా స్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చిన 10వ తరగతి విద్యార్థిని జి.శ్రీవల్లీ(అండర్-17), 8వ తరగతి విద్యార్థిని కె.అరుణశ్రీ (అండర్-14) జిల్లా కబడ్డీ టీముకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వీరికి వాయామ ఉపాధ్యాయురాలు జి.శ్రీదేవి మంచి తర్ఫీదు ఇచ్చారన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వాకతిప్ప విద్యార్థులు

కొత్తపల్లి: కాకినాడలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, 17 కబడ్డీ పోటీల్లో వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో వీరు పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం కృపారావు మంగళవారం తెలిపారు. అండర్-17లో పదో తరగతి విద్యార్థులు దడాల సజీవ, తూటి దీపక్, అండర్-14లో తొమ్మిదో తరగతి విద్యార్థి పక్కుర్తి వెంకటసాయి చైతన్య ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను, వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కనపర్తి నూకరాజును పలువురు ఉపాధ్యాయులు, నాయకులు అభినందించారు.

'ఉచిత ఇసుక'ను తక్షణం అమలు చేయాలి

- 4న ఆందోళనలకు సిద్ధం
- సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నీలపాల సూరిబాబు

పెద్దాపురం: రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు పూర్తవుతున్నా, ఉచిత ఇసుక అమలు చేయలేదని, దీనిపై ఈ నెల 4న ఆందోళనకు సిద్ధం కావాలని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో మంగళవారం సిరిపురపు శ్రీనివాస్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ, ఉచితంగా ఇసుక ఇస్తామని ఆందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. పాలన చేపట్టి వంద రోజులు కావస్తున్నా ఆ హామీని అమలు చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం, కార్మికులు, గృహ నిర్మాణదారులు ఇసుక కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన ఆందోళనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు నీలంశెట్టి పండు, పాశిలి రమణ, తైనాల శ్రీను, ఆదిరెడ్డి కృష్ణ, కరణం అప్పారావు, తాడిశెట్టి గంగ, సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, నాగేశ్వరరావు, తాతారావు, ముత్యం దుర్గ, డి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్ మరమ్మతులు ప్రారంభం



ట్రాక్ మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు

- నేటి నుంచి జి.మేడపాడు గేటు మూసివేత

సామర్లకోట: ఉండూరు రైల్వే గేటులో మంగళవారం నుంచి ట్రాక్ మరమ్మతులు మంగళవారం నుంచి చేపట్టారు. దాంతో రైల్వే గేటును ఈ నెల ఏడు వరకు మూసివేస్తారు. ట్రాక్ పనుల్లో భాగంగా కొత్త పట్టాలు ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాక్ దిగువన రాళ్లను తొలగించి, కొత్త వాటితో నింపుతారని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ తెలిపారు. రైల్వే గేటు మీదుగా సామర్లకోట ఫిల్టర్ బెడ్, ఉండూరు, కాపవరం, పి.వేమవరం, గొంచాల, అచ్చంపేట, నవర, చంద్రంపాలెం గ్రామాలకు రాకపోకలు ఉంటాయి. సామర్లకోట-కాకినాడ రోడ్డులో ఐదు తూముల వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం నుంచి రైల్వే గేటు మీదుగా ఆయా గ్రామాలకు వెళ్లాల్సి ఉంది. దాంతో గేటు మూసివేసినట్టు ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. వివిధ శాఖల అధికారులతో పాటు, యూనియన్లకు సమాచారం ఇచ్చామని రైల్వే అధికారులు తెలిపారు.



సామర్లకోట అయ్యప్ప స్వామి ఆలయం వద్ద వాహనాలు రాకుండా ఏర్పాటుచేసిన బ్యారికేడ్లు

జి.మేడపాడు గేటు కూడా...

బుధవారం నుంచి ఏడో తేదీ వరకు జి.మేడపాడు రైల్వే గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రామసుబ్బారావు తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కోసం గేటు మూసివేస్తున్నట్టు చెప్పారు. గేటు ఆవలి వైపున జి.కొత్తూరు, రాయభూపాలపట్నం, చిన్న బ్రహ్మదేవం, మర్రిపూడి గ్రామాలున్నాయి. ట్రాక్ దిగువ భాగంలో కాను ఉండటంతో ద్విచక్ర వాహనాల రాకపోకలకు అవకాశం ఉంది. ఆయా గ్రామాల వారు ఏడీబీ రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది.